ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

శనివారం 9 మార్చి 2024



విద్యుత్ వెలుగుల్లో గణపురంలోని కోటగుళ్లు

మహేశా.. పాప వినాశా..



మహా శివరాత్రి సందర్భంగా రామప్ప ఆలయం ఆవరణలో కళాకారుల నృత్య ప్రదర్శన

హరహర మహదేవుడి నామస్మరణం మార్మోగింది. మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని శివాలయాలన్నీ కిటకిటలాడాయి. భక్తులు భారీ సంఖ్యలో చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొని పులకించిపోయారు. రోజంతా భక్తిశ్రద్ధలతో ఉపవాసాన్ని పాటించారు. ఆలయాల్లో భజన, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ జాగరణ చేశారు. ముఖ్యంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరాలయం, గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్లు, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయం, మంగపేట మండలంలోని మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు కనుల పండువగా జరిగాయి.

- భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి), ములుగు



కాళేశ్వరాలయంలో స్వామి వారి కల్యాణోత్సవానికి తలంబ్రాలు తీసుకొస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



రామప్ప ఆలయంలో రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



← కాళేశ్వరాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నిశిత అధ్యయనం!

- అన్నారం బ్యారేజీని సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల బృందం
- సుమారు 3 గంటల పాటు పరిశీలన
- డౌన్‌స్ట్రీమ్‌లో సీపేజీలు, 28, 38 పియర్స్ వద్ద తనిఖీలు
- నీటిపారుదల శాఖ నుంచి కీలక సమాచారం సేకరణ



అన్నారం బ్యారేజీ 38వ పియర్‌ను పరిశీలిస్తున్న ఎన్‌డీఎస్‌ఏ బృందం

భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి)/మహదేవపూర్/కాటారం, మార్చి 8: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం పర్యటన మహదేవపూర్ మండలంలో రెండో రోజూ కూడా కొనసాగింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని గురువారం సందర్శించిన బృందం శుక్రవారం అన్నారం బ్యారేజీని పరిశీలించింది. సుమారు మూడు గంటలపాటు ఈ పర్యటన కొనసాగింది. ఇరిగేషన్ అధికారులు, నిర్మాణ సంస్థ ఆఫ్కాన్ ప్రతినిధులను తప్ప ఎవరినీ అనుమతించలేదు.

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ(లక్ష్మి) బ్యారేజీ దెబ్బతినడంతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో భారీగా సీపేజీలు ఏర్పడిన నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకు లేఖ రాసింది. బ్యారేజీలను సందర్శించి వాటికి జరిగిన నష్టంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికలు అందించాలని కోరింది. ప్రభుత్వం కోరిక మేరకు ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఓ బృందాన్ని రాష్ట్రానికి పంపించింది. గురువారం మేడిగడ్డలో పర్యటించిన ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ శుక్రవారం అన్నారం బ్యారేజీని కూడా సందర్శించింది. బ్యారేజీ ఐదో బ్లాక్‌లో భాగంగా 28, 38వ పియర్స్ డౌన్ స్ట్రీమ్‌లో వెంట నుంచి సీపేజీలు ఏర్పడటం, సీసీ బ్లాక్స్ కొట్టుకుపోవడం, లీకేజీల బుంగలు వంటి అంశాలను నిశితంగా పరిశీలించింది. పియర్స్ వద్ద క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ, సీపేజీ బుంగల మరమ్మతులను తనిఖీలు చేసింది. బ్యారేజీకి సంబంధించిన 20 అంశాలపై కీలకమైన డాటాను ఈ బృందం సేకరించినట్లు సమాచారం. సెంట్రల్ వాటర్ కమిషన్(సీడబ్ల్యూసీ)మాజీ చైర్మన్, ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల బృందం అధ్యక్షుడు జె.చంద్ర శేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఢిల్లీకి చెందిన సీఎస్ఎంఆర్ఎస్ సైంటిస్ట్ యు.సి.విద్యార్థి, సీడబ్ల్యూసీ డైరెక్టర్ శివకుమార్‌శర్మ, డ్యామ్ గేట్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ రెజిలియన్స్ డైరెక్టర్ రాహుల్ కుమార్ సింగ్, ఎన్‌డీఎస్‌ఏ డైరెక్టర్ (టెక్నికల్) అమితా బ్‌మీనా, పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ సైంటిస్ట్ ఆర్. పాటిల్ సుమారు 3 గంటలపాటు విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. గురువారం రాత్రి రామగుండంలో బస చేసిన బృందం సభ్యులు అక్కడి నుంచి ఉదయం 10.25 గంటలకు అన్నారం బ్యారేజీ వద్దకు చేరుకున్నారు.

బ్రిడ్జిపై నుంచి అప్‌అండ్ డౌన్ స్ట్రీమ్‌లను పరిశీలించారు. 11.20గంటలకు బ్యారేజీ కిందకి వెళ్లి తనిఖీలు చేపట్టారు. బ్యారేజీలోని 66 గేట్లలో ఐదో బ్లాక్‌లో భారీగా సీపేజీలు ఏర్పడ్డ 28, 38వ పియర్స్‌ను, డౌన్‌స్ట్రీమ్ వెంట వద్ద ఏర్పడిన సీపేజీ బుంగల మరమ్మతులను, లీకేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. బ్యారేజీ నిర్మాణ సమయంలోని ఆల్టర్నేటివ్ సైట్ సెలక్షన్ స్టడీస్(ప్రత్యామ్నాయ స్థల ఎంపిక అధ్యయనం), టోపోగ్రాఫిక్ సర్వే వివరాలు, బ్యారేజీ లేఅవుట్ ప్లానింగ్, డిజైన్స్, ఫౌండేషన్‌కు సంబంధించి జియోలాజికల్, జియో టెక్నికల్ వివరాలు, క్వాలిటీ కంట్రోల్ నివేదికలు, థర్డ్ పార్టీ మానిటరింగ్ నివేదికలు, పియర్స్ కోసం డ్రిల్లింగ్ చేసిన బోర్‌హోల్ లాగ్ వివరాలు, ఎస్‌పీటీ, ప్లేట్ లోడ్ టెస్ట్ ఫలితాలు, రాఫ్ట్ కోసం తీసుకున్న పలు రకాల డిజైన్లు, నీటి నిల్వ, విడుదల సురక్షితంగా చేయడానికి తీసుకున్న లెక్కలు తదితరాల అంశాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. 2020లో 35, 44 పియర్స్ వద్ద సీపేజీలు ఏర్పడగా మరమ్మతులు చేశామని, 2021లో 28, 38 పియర్స్ వద్ద మరోసారి కూడా కొద్దిపాటి లీకేజీలు ఏర్పడి నీరు మాత్రమే వచ్చి ఇసుక రాకపోవడంతో రెండు సంవత్సరాల పాటు బ్యారేజీని నడిపించినట్లు నీటిపారుదల శాఖ అధికారులు నిపుణుల బృందానికి వెల్లడించారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు 2023లో బ్యారేజీలో నీటి నిల్వను తగ్గించి మరమ్మతులు చేసినట్లు చెప్పారు. మూడు బ్యారేజీల నిర్మాణం డిజైన్లు, ఇతర అంశాలు ఒకే విధంగా ఉన్నాయని, సీపేజీలతో రాఫ్ట్ ఫౌండేషన్, పియర్స్ కింద ఇసుక భారీగా కొట్టుకుపోయి కావిటీలు ఏర్పడితే మేడిగడ్డలాగా కుంగిపోతోందని దీనిపై తీసుకున్న చర్యలపై ఇరిగేషన్ అధికారులను ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల బృందం ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాల మేరకు బ్యారేజీలో నీటిని పూర్తిగా తీసేశామని, గేట్ల వద్ద ఇసుక మేటలు ఏర్పడగా తొలగిస్తున్నామని, రాఫ్ట్ కింద ఫౌండేషన్‌లో ఏర్పడ్డ కేవిటీ (ఖాళీప్రదేశం) ఎంత ఉందని బ్యారేజీ నిర్మాణ సంస్థ ఆఫ్కాన్ ప్రతినిధులు ఢిల్లీ కేంద్రంగా నడుస్తున్న స్పార్సన్ ఓవర్సీస్ కంపెనీ లిమిటెడ్ ద్వారా టెక్నికల్ పరీక్షలు చేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు నిపుణుల బృందానికి తెలిపినట్లు సమాచారం.

సుమారు మూడు గంటలపాటు సాగిన ఎన్‌డీఎస్‌ఏ బృందం సభ్యుల పర్యటన మధ్యాహ్నం 1.30 గంటలకు ముగిసింది. వీరి వెంట ఇరిగేషన్ సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ యాదగిరి, ఆఫ్కాన్ సంస్థ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌కు బ్యారేజీల ఇంజనీర్లు

మహదేవపూర్ రూరల్, మార్చి 8: మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో పనిచేసే ఇంజనీర్లంతా హైదరబాద్‌బాట పట్టారు. శనివారం ఉదయం కల్లా జలసౌధాకు రావాలంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ నుంచి నుంచి మౌఖిక ఆదేశాలు వారికి అందినట్లు తెలిసింది. రెండు బ్యారేజీల్లో పనిచేసే ఏఈఈ నుంచి మొదలు ఈఈ వరకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపు వచ్చిందని తెలుస్తోంది. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం గురు, శుక్రవారాల్లో పరిశీలించిన నేపథ్యంలో ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించే అవకాశం ఉందని ఇంజనీర్ వర్గాలు అంటున్నాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యాలయంలో శనివారం జరిగే సమావేశంలో దీనిపై చర్చ జరగొచ్చని తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, అన్నారం బ్యారేజీ సీపేజ్‌లతో పాటు ఇతర అంశాలను సమీక్షిస్తారని సమాచారం.

గిరిజనులకు అత్యున్నత విద్య


- ఈ ఏడాది నుంచే జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం తరగతులు
- తొలుత బీఏ ఇంగ్లిషు, బీఏ సోషల్ సైన్స్ కోర్సులు
- గిరిజనులకు 7.5 శాతం రిజర్వేషన్, 33 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు
- డీపీఆర్, టెండర్లు పూర్తయితే భూమిపూజకు ప్రధాని మోదీ రాక
- కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- జాకారం వైటీసీలో తాత్కాలిక క్యాంపస్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ములుగు, మార్చి 8: దేశంలోని గిరిజనులందరినీ వందశాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్ది, అత్యున్నతవిద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందని, ఇందుకోసం ప్రత్యేక పథకాలను అమలుచేస్తూ ఆర్థిక, సామాజిక, విద్యారంగాల్లో ప్రోత్సాహాన్నందిస్తోందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఏపీ పునర్విభజన చట్టంలో భాగంగా తెలంగాణకు కేటాయించిన ప్రతిష్టాత్మక సమ్మక్క, సారలమ్మ జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ములుగు ప్రాంతానికి తలమానికం అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక యువతకు విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని తెలిపారు. యూనివర్సిటీ కోసం ములుగు మండలం జాకారంలోని వైటీసీలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన క్యాంపస్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఓఎస్డీగా నియమితుడైన వంశీకృష్ణారెడ్డికి బాధ్యతలు అప్పగించి అభినందించారు. అనంతరం వైటీసీ ఆవరణలో జరిగిన సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 49శాతం గిరిజనుల అక్షరాస్యత ఉందని, మహిళల్లో 39శాతంగా ఉందన్నారు. గిరిజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఈ యూనివర్సిటీ దోహదపడుతుందని తెలిపారు. భూసేకరణ, బదలాయింపు ప్రక్రియలో జాప్యం కారణంగా యూనివర్సిటీ ఏర్పాటు ఆలస్యమైందన్నారు. సేకరించిన 335 ఎకరాల్లో 50ఎకరాలకు అటవీశాఖ క్లియరెన్స్ రావాల్సి ఉందని, త్వరగా పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వర్సిటీ నిర్మాణం కోసం కేంద్రప్రభుత్వం రూ.889 కోట్లను కేటాయించిందని అన్నారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. తొలుత బీఏ ఇంగ్లిష్, బీఏ సోషల్ సైన్స్ సబ్జెక్టులను ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. గిరిజనులకు 7.5 శాతం రిజర్వేషన్‌తోపాటు 33శాతం సూపర్ న్యూమరరీ సీట్లను కేటాయిస్తారని తెలిపారు. గిరిజన విద్యార్థుల్లో

మిగతా 8వ పేజీలో...



జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం తాత్కాలిక క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మళ్లీ బలరాముడే..



పోరిక బలరాం నాయక్

- మానుకోట లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్
- మహబూబాబాద్ నుంచి నాలుగోసారి బరిలో..
- ప్రకటించిన ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్

మహబూబాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాంనాయక్ పేరు ఖరారైంది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ.వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7వ తేదీన సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశమై 8 రాష్ట్రాల నుంచి ఎంపీ అభ్యర్థులను ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 17 ఎంపీ స్థానాలు ఉండగా, తొలి జాబితాలో నలుగురు అభ్యర్థులను ఖరారు చేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ నేత సోనియాగాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ నాయకత్వంలో పార్టీ కేం ద్రఎన్నికల కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

నాలుగోసారి..

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ములుగు జిల్లాలోని మారుమూల మదనపల్లె గ్రామానికి చెందిన నిరుపేద దంపతులు పోరిక లక్ష్మీబాయి-లచ్చునాయక్‌లకు నాలుగో సంతానంగా 6 జూన్ 1964న జన్మించిన బలరాంనాయక్.. 2009లో రాజకీయంగా అరంగేట్రం చేశారు. అప్పట్లో జాతీయస్థాయిలో జరిగిన పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనతో ఆవిర్భవించిన మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడ్ పార్లమెంటరీ స్థానం నుంచి తొలిసారి కాంగ్రెస్ తరుపున పోటీచేసి సమీప మహాకూటమి సీపీఐ అభ్యర్థి కుంజా శ్రీనివాస్‌రావుపై 68,957 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదే క్రమంలో పార్లమెంట్ లేబర్ కమిటీలో సభ్యుడిగా, బొగ్గు, విమానయానశాఖ, రైల్వే శాఖ కన్వెన్షన్ కమిటీ సభ్యుడిగా కొనసాగారు. ఆపై జరిగిన యూపీఏ మంత్రివర్గ విస్తరణలో సామాజికవర్గ సమీకరణలు కలిసి రాగా, కేంద్ర సామాజిక న్యాయశాఖ సహాయ మంత్రి పదవి లభించింది. 2014, 2019లలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ నుంచి పోరిక బలరాంనాయక్ పోటీచేసి ఓటమిపాలయ్యారు. అంతకుముందు 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహబూబాబాద్ నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ తరుపున పోటీచేసి ఓటమి చవిచూశారు. తిరిగి రానున్న 2024 పార్లమెంట్ ఎన్నికల్లో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు నేరుగా టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన వారి సంఖ్య 50 వరకు ఉండగా అధిష్ఠానం తిరిగి పోరిక బలరాం నాయక్‌కే టికెట్ ఖరారు చేసింది.

పోరిక బలరాంనాయక్ ప్రొఫైల్ :

పేరు	:	పోరిక బలరాంనాయక్
పార్టీ	:	కాంగ్రెస్
పదవి	:	కేంద్ర మాజీ మంత్రి
విద్యార్హత	:	ఎంఏ
పుట్టిన తేదీ	:	06-06-1964
భార్య	:	తిరుపతమ్మ
పిల్లలు	:	సాయిశంకర్, సాయికిరణ్
తల్లిదండ్రులు	:	పోరిక లచ్చునాయక్-లక్ష్మీబాయి
స్వగ్రామం	:	మదనపల్లి (ములుగు మండలం)
పరిచయం	:	బలరాంనాయక్ హైదరాబాద్

ఏపీఎస్పీ పోలీస్ ఉద్యోగంలో పని చేశారు. ఆ తర్వాత సెక్రటేరియట్ టెలికామ్ ఉద్యోగిగా చేరారు. మరోపక్క ఆలిండియా బంజారా సేవక్ సమాజ్ జాతీయ అధ్యక్షుడిగా పని చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఆవిర్భవించిన మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ నుంచి పోటీచేసి గెలిచి కేంద్ర సహాయమంత్రి పదవిని అధిష్ఠించారు. 2014, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ తరుపున పోటీచేసి పరాజయం పాలయ్యారు. మరోమారు అక్కడి నుంచే ఎంపీగా పోటీచేసి, ఓటమిని చవిచూశారు.

మావోయిస్టు కరపత్రాల కలకలం



కరపత్రాలు కింద వైర్లు, టార్చ్‌లైటు, బ్యాటరీ

వాజేడు, మార్చి 8: మండలంలోని వాజేడు-వెంకటాపురం ప్రధాన రహదారి ప్రగళ్లపల్లి సమీపంలో మురుమూరు వద్ద శుక్రవారం మావోయిస్టుల కరపత్రాలు వెలిశాయి. వాటి కింద వైర్లు, టార్చ్‌లైటు, బ్యాటరీ ఉండటంతో బాంబు అమర్చి ఉంటారనే ప్రచారం కలకలం రేపింది. విషయం తెలుసుకున్న వాజేడు ఎస్సై చవళ్ల వెంకటేశ్వరరావు వెంకటాపురం సీఐ బండారి కుమార్‌కు సమాచారం ఇచ్చారు. బాంబ్ స్క్వాడ్ సభ్యులు అక్కడకు చేరుకొని తనిఖీ చేశారు. చివరకు ఎలాంటి బాంబు లేదని నిర్ధారణకు వచ్చారు. దీంతో అక్కడ ఉన్న కరపత్రాలను పోలీసులు తొలగించి ఊపిరి పీల్చుకున్నారు. మీడియాను సైతం సంఘటన ప్రాంతానికి రాకుండా ఆంక్షలు విధించారు. అయితే.. గతంలో కరపత్రాల మాత్రమే వదిలే మావోయిస్టులు ఈసారి భయభ్రాంతులకు గురి చేసే విధంగా బాంబును అమర్చినట్లు సృష్టించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కరపత్రాలు ఆదివాసీ విప్లవ మహిళా సంఘం, విప్లవ మహిళా సంఘం, సీపీఐ మావోయిస్టు పేరుతో వెలువడ్డాయి. మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం, 114వ వార్షికోత్సవాన్ని విప్లవోత్సాహంతో జరుపుకుందాని పిలుపునిచ్చారు. మణిపూర్ కుకి ఆదివాసీ మహిళపై జరిగిన అమానవీయ అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పేర్కొన్నారు. కార్పొరేటీకరణకు, సైనికీకరణకు, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా విశాల మహిళా పోరాటాలను నిర్మిద్దామని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కాటారంలోని ఆదర్శ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయినుల బృందం

కాటారం, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. మండలంలోని ఆదర్శ విద్యాలయం, వివేకానంద, సువిద్య, కేంబ్రిడ్జి, విద్యానికేతన్ పాఠశాలతో పాటు పలు స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి సంబరాలు చేశారు హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

● వెంకటాపురం(నూగూరు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ లూర్థురాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వేపచెట్టు సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో లూర్థురాజు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ కొండపర్తి సీతాదేవి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు చిడెం సాంబశివరావు, కాల్వ సుందర్‌రావు, కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది హనుమంతు, మహిళలు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

వైషమ్యాలు పెంచే వ్యాఖ్యలు మానుకోవాలి

● ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ములుగు కలెక్టరేట్, మార్చి 8: ప్రజల మధ్య వైషమ్యాలు పెంచే వ్యాఖ్యలను మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మానుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శిరుప సతీష్‌కుమార్, ఏళ్ల మధుసూదన్ హితవు పలికారు. ఈమేరకు వారు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ కోసం అహర్నిశలు కృషి చేసిన ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలను నీచంగా చూసి అనేక రకాలుగా అవమానించి వారి సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. పదేళ్లపాటు పాలన చేసి ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా వ్యవహరిస్తున్నారని దయ్యబట్టారు. ప్రజల్లో భాగమైన ఉపాధ్యాయ, ఉద్యోగులను ప్రజలనుంచి వేరుచేసే విధంగా కుట్రలు పన్నుతూ రెచ్చగొట్టే విధంగా హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తమ పార్టీకి చెందిన నాయకులకు సాగులో లేని భూములకు రైతుబంధు డబ్బులను అక్రమంగా దారి మళ్లించిన నాయకులు ఎంతమంది ఉద్యోగులు ఏసీలలో కూర్చొని పనిచేస్తున్నారనే విషయం తెలియకుండా పాలన చేశారో ప్రజలకు అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు మాత్రమే వేతనాలు పెంచినట్లు దుష్ప్రచారం చేసి ప్రజల్లో ఉద్యోగుల పట్ల కక్షపెంచేవిధంగా వ్యవహరించి ప్రస్తుతం ఫలితాన్ని అనుభవిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా హరీశ్‌రావు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ఉపాధ్యాయ, ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కమలం గూటికి సీతారాం నాయక్



- ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- మహబూబాబాద్ టికెట్‌పై మాజీ ఎంపీకి హామీ
- బీఆర్ఎస్‌లో గౌరవం లేదు.. బీజేపీలో చేరికపై త్వరలో ప్రకటిస్తా : సీతారాం

6లో

కమలం గూటికి సీతారాంనాయక్

ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

మహబూబాబాద్ ఎంపీ టికెట్‌పై మాజీ ఎంపీకి హామీ



సీతారాంనాయక్‌తో భేటి అయిన కిషన్‌రెడ్డి

వరంగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్‌ఎస్‌కు మరో భారీ షాక్ తగిలేలా ఉంది. ఆ పార్టీ సీనియర్ నేత, మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ బీజేపీలో చేరనున్నారు. శుక్రవారం వరంగల్ పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ.కిషన్‌రెడ్డి స్వయంగా సీతారాంనాయక్ ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. తెలంగాణ ఉద్యమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి సీతారాంనాయక్ కీలక పాత్ర పోషించారు. దీంతో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్.. సీతారాంనాయక్ సేవలు గుర్తించి 2014లో మహబూబాబాద్ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించిన సీతారాంనాయక్ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిపై పార్లమెంట్‌లో తరుచుగా గళమెత్తారు. అయితే 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రొఫెసర్ సీతారాంనాయక్‌కు కేసీఆర్ బీఆర్‌ఎస్ టికెట్ నిరాకరించారు. దీంతో అప్పట్లోనే అసంతృప్తిగా ఉన్న సీతారాంనాయక్‌కు రాజ్యసభ, ఎమ్మెల్సీతో పాటు నామినేటెడ్ పోస్టులను ఆశగా చూపించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని సీతారాంనాయక్ అధిష్టానాన్ని కోరారు. అయినప్పటికీ ప్రొఫెసర్‌కు నిరాశే మిగిలింది. దీంతో కనీసం ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో మరోసారి మహబూబాబాద్ నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు కీలక నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే మహబూబాబాద్ నుంచి మరోసారి సిటింగ్ ఎంపీ మాలోతు కవితకే బీఆర్‌ఎస్ కేటాయించింది. దీంతో తీవ్ర నిరాశలో ఉన్న సీతారాంనాయక్ బీజేపీలో చేరనున్నట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది.

పార్టీలోకి అహ్వానించిన కిషన్‌రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రెండు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నారు. వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. శుక్రవారం ములుగులో గిరిజన యూనివర్సిటీలో తాత్కాలిక తరగతుల నిర్వహణకు ప్రారంభం చేసిన కిషన్‌రెడ్డి.. నేరుగా హనుమకొండలోని మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్ ఇంటికి వెళ్లి కలిశారు. సీతారాంనాయక్‌ను శాలువాతో సన్మానించి, బీజేపీలోకి రావాల్సిందిగా కిషన్‌రెడ్డి ఆహ్వానించారు. ఎస్టీల హక్కుల కోసం, గిరిజన యూనివర్సిటీ కోసం ఎంపీగా సీతారాంనాయక్ ఎంతో కృషి చేశారని, అందుకే శాలువాతో సన్మానించి, పార్టీలోకి అహ్వానించినట్లుగా కిషన్‌రెడ్డి తెలిపారు.

గౌరవం లేని చోట ఎందుకు ఉండాలి

తనకు బీఆర్‌ఎస్‌లో అనేక అవమానాలు జరిగాయని, కనీస గౌరవం కూడా లేదని మాజీ ఎంపీ సీతారాంనాయక్ పేర్కొన్నారు. గౌరవం లేని చోట ఎందుకు ఉండాలని, గౌరవించిన వాళ్ల దగ్గరికే ఎందుకు వెళ్లకూడదని ప్రశ్నించారు. ఐదేళ్లుగా ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌కు పార్టీ బాధ్యతలు అడిగినా ఇవ్వలేదు.. సొంత ఖర్చులు పెట్టుకొని పార్టీ కాపాడుకుంటే కనీసం టికెట్ ఇవ్వకుండా అవమాన పర్చారని వాపోయారు. కుటుంబసభ్యులు, కార్యకర్తలతో చర్చించిన తరువాత బీజేపీలో చేరే విషయంపై కార్యాచరణ ప్రకటిస్తానని సీతారాంనాయక్ తెలిపారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ

ముగిసిన జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 8: ఆల్ ఇండి యా టెన్నిస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థా యి పురుషుల ఓపెన్ టెన్నిస్ పోటీలు శుక్ర వారం ముగిశాయి. ముగింపు వేడుకలకు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై హోరాహోరీగా జరిగిన టెన్నిస్ పోటీల్లో విజేతగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆఫీసర్ క్లబ్ వివిధ క్రీడలకు నిలయంగా మారిందని, మిగతా క్రీడాపోటీలకు దీటు గా ఓపెన్ టెన్నిస్ పోటీలను నిర్వహించినందుకు ఆఫీసర్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. విశిష్ట అతిథి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడు తూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. గెలిచిన వారు పొంగకుండా ఓడిన వారు నిరాశ చెందకుండా పోటీతత్వంలో సాధన చేస్తే అనుకూల లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు మట్లాడుతూ.. ఆరు రోజులుగా ఆఫీసర్స్ క్లబ్ వేదికగా నిర్వహించిన ఓపెన్ టూ ఆల్ పురుషుల టెన్నిస్ టోర్నమెంట్‌లో 10 రా ష్ట్రాల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. సింగిల్స్, డబు ల్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ టోర్నీలో ఏజ్ కేటగిరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు సుమారు రూ.1లక్ష నగదు పారితోషికంతో పాటు బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చే యనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి మురుగన్, రాష్ట్ర ఈసీ మెంబర్ బాబురెడ్డి, ఆర్గనైజింగ్ ప్రతినిధులు కన్నారెడ్డి, డాక్టర్ ప్రవీణ్, మనోహర్‌రెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- సింగిల్స్ విన్నర్స్ తరుణ్ కర్ర ప్రథమ స్థానం, ప్రత్యూష్ మహంతి ద్వితీయ స్థానంలో నిలిచారు.
- మెన్స్ డబుల్స్‌లో..: వినిత్ ముత్యాల, సాత్విక్ మురళి ప్రథమ స్థానం, కేఎస్ కవీన్ కార్తీక్, ప్రగతీష్ శివశంకర్‌లు ద్వితీయ స్థానంలో నిలిచారు.

నేడు వర్సిటీకి పనిదినం

కేయూ క్యాంపస్, మార్చి 8: కాకతీయ యూనివర్సిటీ, ఇతర అనుబంధ కళాశాలలన్నీ మార్చి 9న శనివారం యథావిధిగా పనిచేస్తాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 23న సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా సెలవు ప్రకటించిన సందర్భంగా మార్చి 9న రెండో శనివారం పనిదినంగా ప్రకటించినట్లు వెల్లడించారు. వర్సిటీ పరిధిలోని కళాశాలలు, డిపార్టుమెంట్‌లకు, కార్యాలయాలు పనిచేస్తాయని వెల్లడించారు.

కల్యాణ మండపం పునర్నిర్మాణం అద్భుత ఘట్టం

శివరాత్రి రోజు ఆ పరమశివుడికి అంకితం, ప్రజలకు పునరంకితం

కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కల్యాణ మండంలో పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హనుమకొండ, మార్చి8 (ఆంధ్రజ్యోతి): వేయి స్తంభాలగుడి కల్యాణమండపం పునరుద్ధరణ ఓ అద్భుత ఘట్టం అని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. రూ.15కోట్ల వ్యయంతో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని కిషన్‌రెడ్డి శుక్రవారం వేద మంత్రాల మధ్య ప్రారంభించారు.

ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి, ఎంతో ఓర్పుతో, నైపుణ్యంతో పునర్నిర్మించిన కల్యాణ మండపాన్ని మహాశివరాత్రి పర్వదినాన ప్రారంభించినందున్న దీనిని ఆ పరమశివుడికి అంకితమిస్తున్నానని అన్నారు. యావత్ ప్రజలకు పునరంకితం చేస్తున్నానని ప్రకటించారు. కాకతీయుల కాలం స్వర్ణయుగంగా ఆయన అభివర్ణించారు. ఒక చిన్న కల్యాణ మండపాన్ని విప్పి తిరిగి నిర్మించడానికి పంతొమ్మిదేళ్లు పట్టిందని, ఆ కాలంలో అనేక దేవాలయాలు, కోటలు, అనేక ఇతర కట్టడాలను కట్టడానికి ఇంకెన్ని యేళ్లు పట్టి ఉండొచ్చోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలాంటి కట్టడాలను దర్శించి, అనుభూతి పొందినప్పుడు వాటి ప్రాముఖ్యత ఏమిటో తెలుస్తుందని కిషన్‌రెడ్డి అన్నారు. అందువల్ల ప్రాచీన కట్టడాలను, కళాఖండాలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాకతీయ రాజు రుద్రదేవుడు వేయిస్తంభాల గుడి కట్టడానికి 72 ఏళ్లు పట్టిందని, ఇలాంటి అనేక దేవాలయాలను నిర్మించడంలో అనుసరించిన ఇంజనీరింగ్ విధానం అద్భుతమని కొనియాడారు. హిందువులను తమ మతంలోకి మార్చుకోవడానికి 1320లో అప్పటి ముస్లిం పాలకులు ఒక ఎజెండాగా తీసుకొని ప్రణాళిక ప్రకారం లక్షలాది దేవాలయాలను విచక్షణారహితంగా ధ్వంసం చేశారని, అలా ధ్వంసమైన వాటిలో పునరుద్ధరించిన వేయిస్తంభాలగుడిలో ప్రస్తుతం పునరుద్ధరించిన నందీశ్వరుడు కూడా ఉన్నాడన్నారు. కల్యాణ మండపం పునర్నిర్మాణంతో వేయిస్తంభాల గుడికి సంపూర్ణ రూపం వచ్చిందని కేంద్ర మంత్రి అన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత కల్యాణ మండపం పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తికావడంపై దృష్టి పెట్టానని, ఆ మహాశివుడి ఆశీస్సులతో పూర్తి చేయగలిగామని అన్నారు. కాకతీయుల సాండ్‌బాక్స్ టెక్నాలజీనే ఉపయోగించి మరో వెయ్యేళ్లు నిలిచి ఉండేలా మండపాన్ని పునర్నించారన్నారు. మండపం పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన స్థపతి శివకుమార్ శ్రీనివాసన్‌ను కేంద్ర మంత్రి అభినందించారు. నిట్ రిటైర్ ప్రొఫెసర్ పాండురంగారావు కృషి వెలకట్టలేనిదన్నారు. కేంద్రపురావస్తుశాఖ (ఏఎస్ఐ) అధికారులు, సిబ్బంది మండపం పూర్తికి విశేష కృషి చేశారని కొనియాడారు.

కేంద్ర పురావస్తు శాఖ ప్రాచీన కట్టడాలను పరిరక్షించడంలో విశిష్టమైన పాత్రను పోషిస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల్లో అనేక కట్టడాలు ఏఎస్ఐ పరిధిలోకి రాగా, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల తెలంగాణలో కేవలం ఏడు ప్రాచీన కట్టడాలు మాత్రమే ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఏఎస్ఐ పరిధిలోకి తీసుకురావలసిన ప్రాచీన కట్టడాలు ఇంకా అనేకం ఉన్నాయని అన్నారు. వీటన్నిటికీ ఏఎస్ఐ ఆధీనంలోకి తేవడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే కేంద్రపురావస్తు చట్టం చాలా కఠినంగా ఉంటుందని, ప్రాచీన కట్టడాలకు ఏ చిన్నమరమ్మతులు చేయాలన్నా, మార్పులు చేర్పులు జరపాలన్నా పలు అంక్షలు అడ్డువస్తాయన్నారు. పాండవుల గుట్టను ఏఎస్ఐ కిందకు తీసుకురావడానికి ప్రయత్నించగా అటవీశాఖ అభ్యంతరం తెలిపిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఉన్న ప్రాచీన కట్టడాల నిర్వహణకు నిధుల కొరత కొంత అడ్డంకిగా ఉందన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం అభివృద్ధికి చాలినన్ని నిధులను ఇస్తామన్నారు.

శాసన మండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న అనేక అపురూప కట్టడాలను ఏఎస్ఐ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. రామప్పలాగానే హనుమకొండ వేయిస్తంభాల గుడిని కూడా యునెస్కో పరిధిలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవలసిందిగా కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. ఖిలా వరంగల్‌లోలాగానే వేయిస్తంభాల గుడిలో సౌండ్‌అండ్ లైట్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ.. ఒకప్పుడు కాకతీయుల రాజధానిగా విలసిల్లిన ఓరుగల్లు.. కళలకు, కళాఖండాలకు కానాచి అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ నగరం అభివృద్ధి పరంగా ఎంతో వెనుకబడిందన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, స్మార్ట్ సిటీ పథకం కింద నిధులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రాలను సమర్పించారు. కాగా, కల్యాణ మండపం పునర్నిర్మాణంపై కేంద్ర పురావస్తుశాఖ రూపొందించిన ఐదునిముషాల నిడివిని డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించారు.

సత్కారం

కల్యాణ మండపం పునర్నిర్మాణంలో పనిచేసిన స్థపతి శివకుమార్, ఆయనతోపాటు పని చేసిన తమిళనాడుకు చెందిన శిల్పులకు శాలువాలు కప్పి పూలుచల్లి సత్కరించారు. మండపాన్ని పూర్వరూపానికి తీసుకురావడంలో భాగస్వాములైన నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు, కేంద్ర పురావస్తుశాఖ ఉన్నతాధికారులు, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తదితరులకు శాలువాలు కప్పి జ్ఞాపికలను అందచేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ ఉన్నతాధికారులతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ధర్మారావు, వన్నాల శ్రీరాములు మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

శాంతిపూజ

మండపం ప్రారంభానికి ముందు కేంద్ర మంత్రి వేయిస్తంభాలగుడి ఆవరణలోని యాగశాలలో శాంతిపూజలో మహాచండీ యాగం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న కేంద్ర మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కిషన్‌రెడ్డి వేయిస్తంభాలగుడిలో రుద్రేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. పూజలు జరిపారు.



కల్యాణ మండంలోకి వస్తున్న కిషన్‌రెడ్డి



వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో సమావేశమైన కార్పొరేటర్లు

ఎమ్మెల్యే నాగరాజుతో బీఆర్ఎస్ కార్పొరేటర్ల భేటీ

కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం

వరంగల్ క్రైం, మార్చి 8: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ కార్పొరేటర్లు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో భేటీ అయ్యారు. శుక్రవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసానికి ఆరుగురు కార్పొరేటర్లు వెళ్లి ఆయనను శాలువాతో సత్కరించారు. ఆరుగురిలో ఒకరిద్దరు మినహా మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆరుగురు కార్పొరేటర్లు ఎమ్మెల్యేను కలవుడం గమనార్హం. కాగా, మహిళా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశామని కార్పొరేటర్లు చెబుతున్నప్పటికీ కాంగ్రెస్‌లోకి జంప్ కావడం వాస్తవమని సమాచారం. ఇప్పటికే వీరికి ఎమ్మెల్యే నాగరాజు పలుమార్లు ఫోన్ చేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించినట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల ముందే కాంగ్రెస్‌లో చేరాలని పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇటీవల రహస్య సమావేశం నిర్వహించుకున్నట్లు సమాచారం. పార్టీ మారాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగానే మహిళా దినోత్సవం పేరిట ఎమ్మెల్యే నాగరాజును కలిసినట్లు సమాచారం. తనను కలిసిన కార్పొరేటర్లను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. కాగా ఆరుగురు కార్పొరేటర్లు ఎమ్మెల్యేను కలువడం బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు సరికాదు

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక నేత ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే

వడ్డెపల్లి, మార్చి 8: భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం సరికాదని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. మావోయిస్టుల లింకు కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్. సాయిబాబాతోపాటు మరో ఐదుగురిని బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించి వారిని విడుదల చేసింది. సాయిబాబా విడుదలను పురస్కరించుకొని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో హర్షాన్ని ప్రకటిస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా కాత్యాయని విద్మహే మాట్లాడుతూ.. 90 శాతం అంగవైకల్యం ఉన్న సాయిబాబా మరొకరి సహాయం లేనిదే తనపని తాను చేసుకోవడం కూడా అసాధ్యమని అన్నారు. అలాంటి వ్యక్తిని పదేళ్లపాటు జైల్లో నెట్టి కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామిక విలువలను ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పౌరస్పందన వేదిక అధ్యక్షుడు కరేటి శంకర్‌రావు యాదవ్, ప్రజా సంఘాల నాయకులు మెట్టు రవీందర్, అనిశెట్టి రజిత,రామలక్ష్మి, బి. రమాదేవి, ఎం.డి. బాసిత్, వెంగళ్‌రెడ్డి, బిల్లా మహేందర్, బోనగిరి రాములు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

కేయూ దూరవిద్యలో ప్రవేశాలు

డిగ్రీ, పీజీ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం ● 26 వరకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెల్లడి



ప్రవేశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రమేశ్, డైరెక్టర్ రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్, మార్చి 8: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు వివరాలను వెల్లడించారు.

డిగ్రీ మూడేళ్ల కోర్సుల్లో బీఏ హెచ్‌పీపీ, ఎస్‌పీపీ, బీకామ్ జనరల్, కంప్యూటర్, బీబీఏ, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎల్ఐఎస్సీ కోర్సులున్నాయని తెలిపారు. అలాగే ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్‌సైన్స్, ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హ్యూమన్‌రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ సైకాలజీ, ఎన్విరాల్‌మెంట్ సైన్స్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఎంఎల్ఐఎస్సీ కోర్సులున్నాయని తెలిపారు. డిప్లొమా కోర్సుల్లో బిజినెస్ మేనేజ్‌మెంట్ రిటైల్ మార్కెటింగ్, ట్యాలీ, కంప్యూటర్ అప్లికేషన్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మిమిక్రీ, వోకల్ మ్యూజిక్, ఇన్స్ట్రుమెంటేషన్ మ్యూజిక్, సాఫ్ట్‌స్కిల్స్, మీడియా ఫొటోగ్రఫీ కోర్సులున్నాయని వివరించారు. కోర్సుల్లో ప్రవేశాలకు మార్చి 26 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్లు పొందవచ్చునని పేర్కొన్నారు. రూ.300 అపరాధరుసుంతో మార్చి 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. ఫీజు, కోర్సు వివరాలు, ప్రవేశార్హతలు వర్సిటీ వెబ్ సైట్ జ్జ్ఞ://శీశీ.ఊీజూఛ్రిజుంభౌ.జీ/లో అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.

కేయూ దూరవిద్యకేంద్రం తెలంగాణలో పెద్ద డ్యూయల్ మోడ్ వర్సిటీ అని వీసీ రమేశ్ చెప్పారు. గ్రామీణ, పట్టణ, ఉద్యోగార్థులు, పార్టుటైమ్ ఉద్యోగాలు చేసేవారికీ బాగా ఉపయోగపడుతోందని తెలిపారు. ప్రత్యేక్ష కాంటాక్టు తరగతులు, ఆన్‌లైన్, రేడియో తరగతులతోపాటు వివిధ మాధ్యమాలతో బోధన ఉంటుందని వెల్లడించారు. యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డు, ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థలతోపాటు వర్సిటీ చట్టం మేరకు తరగతుల నిర్వహణతో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిత్వవికాస తరగతులు, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ స్కిల్స్ నేర్పిస్తామని వెల్లడించారు. ప్రవేశాల పొందిన విద్యార్థులకు ఎప్పటికప్పుడూ వైబ్‌సైట్, సెల్‌ఫోన్‌లో సంక్షిప్త సమాచారం అందుతోందని వెల్లడించారు. బ్రోచర్ విడుదల చేసినవారిలో కేయూ సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, డీవో ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీవి విద్యా వ్యతిరేక విధానాలు



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ స్టాలిన్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 8: భారతీయ జనతా పార్టీ విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్ స్టాలిన్ మాట్లాడారు. విద్య కాషాయికరణ, ప్రైవేటీకరణ, కేంద్రీకరణ కోసమే జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెడుతోందని ఆరోపించారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా నూతన జాతీయ విద్యా విధానం ఉందన్నారు. ఎన్‌ఈపీని ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, బడుగు, బలహీన, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో బీజేపీ విఫలమైందన్నారు. ఎన్ఈపీ రద్దు కోసం ఏఐఎస్ఎఫ్ దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణతోపాటు ఉద్యమాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మారుమోగిన శివనామస్మరణ

హనుమకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా హనుమకొండలోని చారిత్రక రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాలగుడిని వేలాది మంది సందర్శించారు. స్వామి వారికి మహారుద్రాభిషేకాలు జరిపారు. ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని తెల్లవారుజామున 3.30 గంటలకు సుప్రభాతం, 4 గంటల నుంచి స్వామివారికి సామూహిక రుద్రాభిషేకాలు, నిత్యవిధి, హవనం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఎండలోనూ భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉన్నారు. వేయిస్తంభాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రుద్రేశ్వర కల్యాణం

వేయిస్తంభాల గుడిలో సాయంత్రం 6.59 గంటలకు ధనిష్ఠ నక్షత్రయుక్త సింహలగ్న సుముహూర్తాన శ్రీ రుద్రేశ్వరీ రుద్రేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆగమ వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య గణపతి పూజ, ఉత్సవమూర్తుల ఎదురుకోలు, బాషికధారణ, జిలకర బెల్లం, యజ్ఞోపవీత ధారణ,, మహా సంకల్పంలాంటి వైదిక కార్యక్రమాలను నిర్వహించి కల్యాణోత్సవం తలంబ్రాల పర్వం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ కల్యాణ తంతును పర్యవేక్షించారు. ఈవో వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రముఖ ఆధాత్మిక వేత్తల పురాణ ప్రవచనంతో భక్త జనులు పులకించిపోయారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులను చేసిన శ్రీరుద్రేశ్వరీ, రుద్రేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఎంతో అందంగా అలంకరించారు. వేయిస్తంభాల ఆలయంలో జాగరణ చేసే భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



వేయిస్తంభాల ఆలయం వెలుపల బారులుతీరిన భక్తులు

పలు ఇతర ఆలయాల్లో..

వరంగల్ కోటలోని స్వయంభూ శంభులింగేశ్వరాలయం, వరంగల్ మట్టేవాడలోని భోగేశ్వరాలయం, భద్రకాళిగుడిలోని భద్రేశ్వర స్వామి ఆలయం, హనుమకొండలోని సిద్ధేశ్వరాలయం, మడికొండలోని మెట్టురామలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉజ్జయినీ మహాకాళ్వేర శివలింగ దర్శనం, 12 అడుగుల మహాశివలింగాన్ని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని శ్రీగట్టుమల్లికార్జున స్వామి ఆలయం, ములుగు జిల్లా పాలంపేటలోని చారిత్రక రామప్ప దేవాలయం, ఆత్మకూరులోని పంచకూట ఆలయం, వరంగల్ ఉర్సు జాగీరులోని ఫణిగల రామప్ప గుడి, ఐనవోలులోని ప్రాచీన మల్లికార్జునస్వామి ఆలయం, వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, కరీమాబాద్‌లోని విశ్వేశ్వరాలయం, కాశిబుగ్గలో ని విశ్వేశ్వరాలయం, జనగామ జిల్లా కుందారం గ్రామంలోని కుందేశ్వరాలయం, మహబూబాబాద్ జిల్లా కురవిలోని వీరభద్రస్వామి ఆలయం, నీరుకుళ్లలోని చెన్నకేశవ ఆలయం సహా పలు శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. వరంగల్ రామన్నపేటలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆల యం, వరంగల్‌లోని దుర్గేశ్వర స్వామి ఆలయం, ఆత్మకూరు మండలం కటాక్షపురంలోని త్రికూటాలయం దామెర మండల కేంద్రంలోని దామేశ్వరాలయంతో సహ పలు ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు నేత్ర పర్వంగా జరిగాయి.

మంత్రుల పూజలు

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వేయిస్తంభాలగుడి, భద్రకాళి గుడిని, రామప్ప ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ నగరంలోని పలు దేవాలయాలను సందర్శించి శివపూజలు చేశారు. వరంగల్ శివనగర్‌లోని రామాలయం ఖిలావరంగల్‌లోని స్వయం భూ దేవాలయం తదితర ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. భీమదేవరపల్లి మండలం వంగర, ముత్తారం శివాలయాల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వేయిస్తంభాలగుడిని సందర్శించి పూజలు నిర్వహించారు.



ఒగ్గు పూజారులు వేసిన పెద్దపట్నం వద్ద బండారి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు, పాల్గొన్న డీసీపీ, ఏసీపీ, ఈవోలు

శిగాలూగిన మల్లన్న క్షేత్రం

ఐనవోలు, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఐనవోలు మల్లికార్జునస్వామి శైవక్షేత్రంలో పరమశివుడి సేవలో భక్తులు పరవశించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో దేవస్థానం ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం స్వామి వారి మేలుకొలుపు సుప్రభాత ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అభిషేకాలు కొనసాగాయి. భక్తులు మొక్కులు చెల్లించి స్వామివారిని దర్శించుకున్నారు.

స్వామి వారికి సింహవాహనసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు ఉదయం 8 గంటలకు సింహవాహనసేవలో(స్వామి వారిని) మాడవీధుల గుండా ఊరేగించారు. యాగశాలలో రుద్రహోమాలు అష్టోత్తర 108 కలశాల్లో నదీసముద్రజలాలు, సుగంధ ద్రవ్యాలు, అభిషేక ద్రవ్యాలు ఉంచి నాలుగు కాలముల్లో పూజించారు. ఈ కలశాలతో లింగోద్భవకాలంలో మహాభిషేకం నిర్వహించారు. రాత్రి వేళ నందివాహన సేవను నిర్వహించారు. ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

పెద్దపట్నంపై భక్తుల శివతాండవం

మల్లన్న స్వామికి అత్యంత ప్రీతికరమైన పెద్దపట్నంను ఒగ్గు పూజారులు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల చూర్ణాలు(పిండి) ముగ్గులతో కాకతీయులు నిర్మించిన నృత్య మండపంలో పట్నం (మండపం)ను 12 అడుగుల వెడల్పు, పొడవుతో అందంగా వేశారు. మధ్యలో స్వామి అమ్మవార్లను పూజించి అవాహనం చేసి ఒగ్గు కథ ద్వారా కల్యాణ గాధను పఠించారు. తదుపరి భక్తి పారవశ్యంతో పట్నంపై మైమరిచి శివతాండవం నృత్యం చేశారు. వందల సంఖ్యలో పెద్దపట్నంపై నృత్యాలు చేయడం కనువిందుగా నిలిచింది. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై అనిల్‌కుమార్ నేతృత్వంలో సుమారు 150 మంది పోలీసులు నృత్య మండపం వద్ద తొక్కిసలాట జరుకుండా కట్టడి చేశారు. భక్తులు నృత్యాలు చేయడానికి చూడటానికి మండపం వద్ద పోటీపడి నెట్టుకున్నారు.

కమనియం మల్లన్న స్వామి కల్యాణం

ఐనవోలు మల్లికార్జునస్వామి కల్యాణం కనులపండుగగా కనువిందు చేసింది. భ్రమరాంబమల్లికార్జునస్వామి వారిని నంది వాహనంపై నాలుగు వీధుల్లో కనువిందు చేసి కల్యాణ మండపానికి తీసుకవచ్చారు. వేద మంత్రోచ్చరణ నడుమ శైవాగమ శాస్త్రోక్తంగా యాగ్నికులు శ్రీనివాస్‌కుశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, పురోహిత్ ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితుడు పురుషోత్తంశర్మ, విక్రమ్ జోషి, యాగ్నికులు శ్రీకాంత్‌శర్మ అర్చక బృందం కల్యాణం జరిపారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తీసుకవచ్చారు. పట్టువస్త్రాలు, ఉత్సవ విగ్రహాలతో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికు చేరుకున్నాక సుమారు 2గంటల పాటు కల్యాణం నిర్వహించారు. భక్తులు శివనామస్మరణతో అసాంతం తన్మయతంతో తనివితీరాస్వామిని సేవించి భక్తిని చాటుకున్నారు. కల్యాణంలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కూతురు దివ్యరాజ్, కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ బొల్లేపల్లి మధుగౌడ్, మోహన్‌గౌడ్, మార్నేని వెంకటేశ్వర్‌రావు, రాయపురం సాంబయ్య, అనుముల రవీందర్, పల్లకొండ రమేష్, గిరుక రాజు, రాజిరెడ్డి, ఐనవోలు గ్రామ పురప్రముఖులతోపాటు ఆయా ప్రాంతాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు కల్యాణ తంతులో పాల్గొన్నారు.



తాళి చూపిస్తున్న దృశ్యం

గిరిజన విద్యార్థులకు 40.5 శాతం రిజర్వేషన్

26వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు

ప్రస్తుతం బీఏ ఇంగ్లిష్, బీఏ సోషల్ సైన్స్‌లో అడ్మిషన్లు

గిరిజన విశ్వవిద్యాలయం ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డి

ములుగు, మార్చి 8: ములుగు జిల్లా కేంద్రం శివారులో ఏర్పాటు చేసిన సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయంలో గిరిజన విద్యార్థులకు యూజీసీ నిబంధనల ప్రకారం 7.5 శాతం రిజర్వేషన్‌తోపాటు 33 శాతం సూపర్ న్యూమరరీ సీట్లను కేటాయించినట్టు యూనివర్సిటీ ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం జాకారం వైటీసీలో తాత్కాలిక క్యాంపస్ ప్రారంభోత్సవం తర్వాత ఆయన మాట్లాడారు. 2024-25 విద్యాసంవత్సరానికి బీఏ-ఇంగ్లిషు, బీఏ సోషల్ సైన్స్ కోర్సులను ప్రవేశపెట్టినట్టు చెప్పారు. నాలుగేళ్ల కాలపరిమితి కలిగిన ప్రతి కోర్సులోనూ 32సీట్లు ఉంటాయని, వీటిలో ఎనిమిది చొప్పున గిరిజనులకు సూపర్ న్యూమరరీ కింద కేటాయించామని అన్నారు.



మాట్లాడుతున్న వంశీకృష్ణారెడ్డి

ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. ఈనెల 26లోగా అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే నెలలో కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ ఉంటుందని, ఫలితాల ఆధారంగా జూలైలో అడ్మిషన్ ప్రక్రియ పూర్తయి ఆగస్టులో తరగతు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పనిచేస్తున్న బోధనా సిబ్బందినే నియమిస్తామన్నారు. సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ పేరిట ప్రత్యేక వెబ్‌సైట్‌ను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్ఎస్‌సీటీయూ.ఏసీ.ఇన్ ఏర్పాటుచేశామని తెలిపారు. ఆసక్తి కలిగిన యువకులు యూనివర్సిటీ మొదటి బ్యాచ్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆదివాసీలు కుల దైవాలను మర్చిపోవద్దు

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ములుగు, మార్చి 8: ఆదివాసీల తమ కుల దైవాలను మర్చిపోవద్దని, సనాతన సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు మండలం అంకన్నగూడెంలో జరుగుతున్న బాలకుమారస్వామి జాతరను శుక్రవారం సీతక్క సందర్శించారు. ఆదివాసీల ఆరాధ్య దైవం బాలకుమార స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో బాలకుమారస్వామి దేవుని చరిత్రపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. తన బాల్యం నుంచి ఈజాతరకు వస్తున్నానని తెలిపారు. మేడారం అనుబంధ చిన్న జాతరల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. జంగాలపల్లి నుంచి జగ్గన్నగూడెం వరకు రూ.34కోట్లతో రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం కృషిచేస్తానని తెలిపారు. తొలిసారిగా మంత్రి తమ గ్రామానికి రావడంతో జాతర ప్రధాన ధర్మకర్త, డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో శాలువ, జ్ఞాపికలతో సీతక్కను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, ఎంపీటీసీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



బాలకుమారస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సీతక్క

కలెక్టరేట్ పనుల తనిఖీ

గట్టమ్మ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా కలెక్టరేట్ భవన సముదాయ పనులను మంత్రి సీతక్క తనిఖీ చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతూ ఏడాదిలోగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

మంత్రి సుడిగాలి పర్యటన

ఏటూరునాగారం, మార్చి 8 : మంత్రి ధనసరి అనుసూయ సీతక్క మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండలం కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరయ్యారు. అంబేద్కర్ కాలనీలోని కొమరవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవ స్వామివారి పట్నాల వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నబోయినపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. షాపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరి దేవాలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆకులవారిఘణపురంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరుగుతున్న వాలీబాల్ క్రీడల ముగింపు కార్యక్రమంలో పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. రామన్నగూడెంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ యూత్ అధ్యక్షుడు వసంత శ్రీనివాస్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, టౌన్ ఉపాధ్యక్షుడు మామిడి రాంబాబు, టౌన్ అధ్యక్షుడు సరికొప్పుల శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు నవీన్, ఎమ్డీ. గౌస్ తదితరులు ఉన్నారు.

వైభవంగా శివరాత్రి వేడుకలు



రామప్ప ఆలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పూజలు



కాళేశ్వరాలయంలో ఎస్పీ దంపతుల పూజలు



ములుగులోని నగరేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

మహదేవపూర్, మార్చి 8: మహాశివరాత్రి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం శుభానందా ముక్తీశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. స్వయంగా తలంబ్రాలను తీసుకొచ్చి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ గుడాల అరుణ, ఎంపీపీ బన్సోడ రాణిబాయి, ఎంపీటీసీ మమత, ఆలయ ఈవో మారుతి, మాజీ ధర్మకర్త అశోక్, కాంగ్రెస్ నాయకులు గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు. కల్యాణ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 11 నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, త్వరలోనే దీన్ని పూర్తి చేస్తామని వివరించారు. ముక్తీశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం దాతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, ఎస్పీ కిరణ్ ఖారే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● వెంకటాపూర్(రామప్ప) : రామప్ప రామలింగేశ్వరస్వామి శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం కోసం దేవాదాయ కార్యనిర్వహణ అధికారి బిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తుల భజన కీర్తనలు, డోలి వాయిద్యాల నడుమ శివయ్య కల్యాణం వైభవంగా జరిగింది. జాగరణ చేపట్టిన భక్తులు సాయంత్రం ఆలయానికి చేరుకుని భజనలు చేస్తూ పాటలు పాడారు. సాయంత్రం నుంచి భక్తుల సంఖ్య ఎక్కువ కావడంతో పోలీసులు, ఆలయ సిబ్బంది క్యూలైన్లలో పంపించారు. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు సుమారు 50మంది భక్తులు రావడంతో రామప్ప గార్డెన్ కిటకిటలాడింది. కల్యాణ మహోత్సవంలో భక్తులు, అధికారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కోమళ్లపల్లి హరీష్‌శర్మ, ఉమాశంకర్‌లు, దేవాదాయశాఖ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కేంద్రమంత్రి రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డికి ఆలయ మర్యాదలతో నూతన వస్త్రాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆలయ గార్డెన్‌లో విలేకరులతో మాట్లాడారు. రామప్పలోని కామేశ్వరాలయాన్ని పునర్నిర్మాణం చేసేందుకు రూ.11కోట్ల నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. వెంటనే పనులను ప్రారంభించాలని అన్నారు. రామలింగేశ్వరస్వామి దేవాలయం తూర్పు ముఖద్వారానికి ఎదురుగా ప్రసాద్ స్కీం కింద రూ.60కోట్లతో చేపడుతున్న ఇంటర్ప్రిటేషన్ సెంటర్, షాపింగ్ కాంప్లెక్స్ పనులను త్వరితగతిన నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనవెంట కేంద్ర పురావస్తుశాఖ సూపరింటెండెంట్ స్మిత ఎస్ కుమార్, ఇంజనీర్ కృష్ణచైతన్య, డిప్యూటీ ఇంజనీర్ చంద్రకాంత్, జిల్లా అధికారి మల్లేష్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్నేని ధర్మారావు, పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, నాయకులు పోలెపల్లి సరోత్తంరెడ్డి, కీర్తిరెడ్డి, భూక్య జవహర్‌లాల్, అల్లె శోభన్, రమేష్, సురేందర్, మల్లేష్, రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు, తదితరులు ఉన్నారు.

● ములుగు : ములుగులోని నగరేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో రాష్ట్రమంత్రి సీతక్క పాల్గొన్నారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు తలంబ్రాలు పోశారు. ఈ వేడుకను తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

● తాడ్వాయి: మండలవ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని కాటాపూర్, బీరెల్లి, పంబాపూర్, లింగాల, కామారం, తాడ్వాయి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శివాలయాల వద్ద రాత్రి మహిళలు అధికసంఖ్యలో పాల్గొని జాగరణ చేశారు.

● వెంకటాపురం(నూగూరు): మండలకేంద్రంలోని ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం వైభవంగా మహాశివరాత్రి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

● చిట్యాల : మండలంలోని పలు గ్రామాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఒడితల, నవాబుపేట, జూకల్, చల్లగరిగతో పాటు అన్ని గ్రామాల్లో ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఒడితెల రామలింగేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు.

● గణపురం : కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో శివపార్వతుల కల్యాణాన్ని పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నరేష్, గంగాధర్ ప్రత్యేక పూజలు చేశారు. శివపార్వతుల కల్యాణాన్ని ఆలయ ధర్మకర్త అట్లూరి వెంకటలక్ష్మీ నరసింహరావు, పావన రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాజాగరణ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, డాక్టర్ లలితాదేవి, రాజేశ్వరప్రసాద్, వంద పడకల ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ హాజరయ్యారు.

● కాటారం: మండలంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్పస్వామి, భక్తాంజనేయ స్వామి, ధన్వాడ దత్తాత్రేయస్వామి, రేగులగూడెం, గంగారం, కాటారం భక్తాంజనేయస్వామి ఆలయాల్లో వేదపండితులు మహాన్యాసక పూర్వక ఏకదశరుద్రాభిషేకాలు, సహస్రానామార్చన, బిల్వార్చన నిర్వహించారు. పలువురు భక్తులు కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో, దామెరకుంట గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. మహిళలు ఉపవాసాలు, జాగారాలు ఉండి పరమశివుడిని ఆరాధించారు. సాయంత్రం ఇంటి ముందు గండదీపాలు, ఆకాశదీపాలు వెలిగించారు ఆలయాల్లో మొక్కులు తీర్చుకున్నారు.



మంగపేట మండలంలో మల్లూరు ఆలయంలో భక్తుల పూజలు

● భూపాలపల్లి: మహాశివరాత్రి వేడుకలు రేగొండ మండలంలో ఘనంగా జరిగాయి. పురాతన గడిపల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు సముద్రాల సురేష్ చార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఎంపీపీ పొన్నం లక్ష్మి, నాయకులు ఎడ్ల రవికుమార్, గండి తిరుపతి, రవీందర్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి : మండలంలోని శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని సాంబమూర్తి దేవాలయం, పర్లపల్లిలోని శివచెన్నకేశవాలయం, పిడిసిల్లలోని శివాలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అభిషేకాలు, అర్చనలు చేపట్టి శివపార్వతుల కల్యాణం జరిపించారు. పరమశివుడిని మనసారా వేడుకొని ఉపవాసంతో జాగరణ చేశారు. పర్లపల్లి, పిడిసిల్ల ఆలయాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రామలింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● మంగపేట: మండలంలోని కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, చెరుపల్లి, మల్లూరు, వాడగూడెం, పాలాయిగూడెం, రమణక్కపేట, రాజుపేట, దేవనగరం, నడిమిగూడెం, అకినేపల్లి-మల్లారంలోని ఉమాచంద్రశేఖరస్వామి, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, సీతారామచంద్రస్వామి, సాయిబాబా, శంభులింగేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, లక్ష్మీ నరసింహస్వామి, కొండలింగేశ్వరస్వామి దేవాలయాల్లో వ ప్రత్యేక పూజలు జరిగాయి. మంగపేటలోని వెలిసియున్న పూరాతన దేవాలయమైన శ్రీ ఉమాచంద్రశేఖర స్వామి దేవాలయంలో వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్వామి వారి కల్యాణోత్సవంలో సుమారు 15 వేల మంది హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ కొలగట్ల నరేష్‌రెడ్డి, ప్రధానార్చకుడు విస్సావజ్జుల నరేష్‌శర్మ పాల్గొన్నారు.

గిరిజనులకు అత్యున్నత విద్య

(5వ పేజీ తరువాయి)

ఎక్కువ మందికి ప్రవేశం లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డీపీఆర్, టెండర్ ప్రక్రియ పూర్తయితే త్వరలోనే భూమిపూజ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తారని వెల్లడించారు. ఈ విశ్వవిద్యాలయంలో గిరిజనుల సంస్కృతి, జీవన విధానం, కళల, సంప్రదాయ మూలికా వైద్యంపై పరిశోధనలు జరిపి నిక్షిప్తం చేస్తూ తద్వారా భవిష్యత్ తరాలకు అందించనున్నట్టు తెలిపారు. వర్సిటీకి సమ్మక్క, సారలమ్మ పేరును ప్రతిపాదించగానే పీఎం మోదీ ఒప్పుకున్నారని, ఆరాధ్య దైవాలైన వనదేవతల పేరిట గొప్ప విద్యాసంస్థ ఏర్పాటు కావడం గర్వకారణమని తెలిపారు.

నిర్వహణ బాధ్యత హెచ్‌సీయూది..

ట్రైబల్ వర్సిటీ నిర్వహణ బాధ్యతను కొంతకాలం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మెంటార్‌గా వ్యవహరిస్తుందని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. అడ్మిషన్, అడ్మినిస్ట్రేషన్ ప్రక్రియ అంతా వారే పర్యవేక్షిస్తారన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల నియామకం జరుగుతుందని తెలిపారు. ఈ యూనివర్సిటీలో గిరిజన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా యూనివర్సిటీని కాపాడుకోవాలని, అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. దీంతో ఈ ప్రాంతం పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతుందని, స్థానిక యువకులు ఎక్కువ మంది యూనివర్సిటీలో అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పర్యాటకాభివృద్ధి సహకారం

ములుగు ప్రాంతంలోని పర్యాటక ప్రదేశాలను కేంద్రం నిధులతో అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో ఏడు ప్రదేశాల్లో అభివృద్ధి, సుందరీకరణ జరిగిందన్నారు. ట్రైబల్ యూనివర్సిటీ స్థాపనతో ఈ ప్రాంతం పురోగతి సాధిస్తుందని ఆకాంక్షించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో యునెస్కో గుర్తింపు పొందిన ఏకైక చారిత్రక కట్టడం రామప్ప దేవాలయం కావడం విశేషమని, ఇందుకోసం మోదీ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేందుకు రూ.65కోట్లతో విస్తృతంగా సదుపాయాలను కల్పించడం జరుగుతోందని తెలిపారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా ములుగు : మంత్రి సీతక్క

అద్భుతమైన ప్రకృతి రమణీయ, చారిత్రక ప్రదేశాలున్న ములుగును టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని రాష్ట్రమంత్రి సీతక్క కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. జాతీయ గిరిజన విశ్వవిద్యాలయ స్థాపనతో ఈ ప్రాంతవాసులకు ఉన్నత విద్యావకాశాలు మెరుగుపడ్డాయని తెలిపారు. 2014లో విభజన చట్టంలో మంజూరైన యూనివర్సిటీ ఏర్పాటుకు పదేళ్లకాలం పట్టిందని, ఈ క్రమంలో అనేక ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కొని ములుగులో నిర్మించేలా దివంగత మాజీమంత్రి అజ్మీరా చందూలాల్, మాజీ ఎంపీ సీతారాంనాయక్ కృషి చేశారన్నారు. కోర్సుల సంఖ్యను పెంచాలని, ఎక్కువ మంది గిరిజన విద్యార్థులకు అడ్మిషన్‌లు దక్కేలా రిజర్వేషన్‌ను పెంచాలని కోరారు.

పార్లమెంట్‌లో కొట్లాడాం.. : ఎంపీ కవిత

తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం కోసం పార్లమెంట్‌లో కొట్లాడటం జరిగిందని, అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత అన్నారు. సుదీర్ఘ ప్రయత్నం తర్వాత యూనివర్సిటీని సాధించుకోవడం గర్వంగా ఉందన్నారు. గిరిజనుల పేరిట ఏర్పాటుచేస్తున్న యూనివర్సిటీలో గిరిజనులకు ఎక్కువ సీట్లు కేటాయించాలని కోరారు. కాగా, శిలాఫలకంపై ఎంపీగా తన పేరు లేకపోవడంపై కవిత అసహనం వ్యక్తంచేశారు. అయితే.. ఈ అంశాన్ని వివాదం చేయదల్చుకోలేదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, హెచ్‌సీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ తుకారాం, ట్రైబల్ వర్సిటీ ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డి, యూనివర్సిటీ ఇంజనీర్ హనుమంతరావు, ఐటీ డైరెక్టర్ సంజయ్‌కుమార్ శర్మ, సిస్టం అనాలసిస్ట్ మహ్మద్ అలీబేగ్ పాల్గొన్నారు.

కనుల పండువగా గట్టుమల్లన్న జాతర



గట్టుమల్లన్నను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు

టేకుమట్ల, మార్చి 8: మండలంలోని బోర్నపల్లి గ్రామంలో శుక్రవారం గట్టు మల్లన్న జాతర కనుల పండువగా జరిగింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి గుట్టపై ఉన్న మల్లికార్జునస్వామితో పాటు, రాముడి పాదాలు, గండ దీపాలను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కూడా హాజరయ్యారు. అలాగే వెలిశాల, రాఘవరెడ్డిపేట గ్రామాల్లో శివాలయాలలో జరిగిన శివపార్వతుల కల్యాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారారావు దంపతులు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, వివిధ గ్రామాల కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

పరకాల, మార్చి 8: పరకాల పట్టణంలోని శారదా విద్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మార్క సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర, వారి గొప్పతనం వెలకట్టలేనిదన్నారు. విద్యాబుద్ధులు నేర్పించడంలో మహిళా ఉపాధ్యాయుల కృషి అమూల్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి ఉపన్యాసాలు, పాటలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ.సుజిని, ఎన్.నిరోష, ఎన్.భార్గవి, సీహెచ్. రజిని, రజిత, శైలజ, రమణి, విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

అవిశ్వాసంపై హైకోర్టు ఇంటీరియం సస్పెన్షన్ ఉత్తర్వులు

కాటారం, మార్చి 8: గారెపల్లి(కే) ప్రాథమిక సహకారం సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం కోసం ఈ నెల 11న సభ ఏర్పాటుకు డీసీవో ఇచ్చిన ఆదేశాలను సస్పెండ్ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైకోర్టులో 5960ఆఫ్2024 రిట్ పిటిషన్ దాఖలు చేయగా ఈనెల 6న ఇంటిరియం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేస్తూ సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. ఈ నెల 20 వరకు అవిశ్వాసం తీర్మానం సభను ఏర్పాటు చేయకుండా ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. రైతులు తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని అభివృద్ధి చేశానని తెలిపారు. సంఘానికి కొన్ని స్థిరాస్తులు సాధించినప్పటికీ కొందరు పదవులను అడ్డం పెట్టుకుని డైరెక్టర్లను భయపెట్టి అవిశ్వాసం పెట్టించారని ఆరోపించారు.

వలస కూలీల వివరాలు అందించాలి

వెంకటాపురం(నూగూరు), మార్చి 8: మండలంలోని పలు గ్రామాల్లోని మిర్చితోటలకు పనులకు వచ్చే ఛత్తీస్‌గఢ్ వలస కూలీల వివరాలను రైతులు పోలీసులకు అందించాలని ఎస్సై అశోక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఉన్న వలస కూలీల కూలీల ఆధార్‌కార్డులను ఎస్సై పరిశీలించి వారి వివరాలను సేకరించారు. వలస కూలీల ముసుగులో నిషేధిత మావోయిస్టుపార్టీకి సంబంధించిన వ్యక్తులు వచ్చే అవకాశం ఉందని ఎస్సై అన్నారు. వలస కూలీలతో అనుమానిత వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని, బాలకార్మికులను మిర్చితోటల్లో పనులకు పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎంఎస్‌పీ నుంచి బహిష్కరణ

ములుగు కలెక్టరేట్, మార్చి 8: ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నుంచి వావిలాల స్వామిని బహిష్కరిస్తున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి గుగ్గిళ్ల పీరయ్య తెలిపారు. ములుగులో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏటూరునాగారం గ్రామానికి చెందిన వావిలాల స్వామి సొంత నిర్ణయాలు తీసుకుంటూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీలను అవమానిస్తున్నారని, అది గమనించిన నాయకత్వం పలుమార్లు హెచ్చరించినా మార్పు రానందుకే స్వామిని క్రమశిక్షణ చర్యల కింద ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఇన్‌చార్జి ఇరుగు పైడి, జిల్లా అధికార ప్రతినిధి గజ్జల ప్రసాద్, నాయకులు మరాటి రవీందర్, గజ్జల ప్రశాంత్, తోకల రాంబాబు, ఎనగందుల మొగిలి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు ఇంటి స్థలం కేటాయించాలి : ఐఎన్‌టీయూసీ

కాకతీయఖని, మార్చి 8: సింగరేణి కార్మికులకు సొంతంగా ఇళ్లు నిర్మించుకునేందుకు 250 గజాల స్థలం కేటాయించాలని ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు జోగ బుచ్చయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో కాలంగా సింగరేణి సంస్థలో పనిచేస్తున్నా కార్మికులకు సొంత ఇల్లు లేని పరిస్థితి నెలకొందన్నారు. ఉద్యోగ విరమణ పొందిన అనంతరం వారు ఎక్కడ ఉండాలో తెలియని దుస్థితి ఉందన్నారు. సింగరేణి స్థలాల్లో సంస్థకు సంబంధంలేని వ్యక్తులు ఇళ్లు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారని, అలాంటిది సంస్థకోసం అహర్నిషలు శ్రమించి పనిచేసే కార్మికులకు 250 గజాల స్థలం కేటాయిస్తే తప్పేంటని ప్రశ్నించారు. యాజమాన్యం అర్హులైన కార్మికులను గుర్తించి ఇంటి స్థలం కేటాయించాలన్నారు. కొందరు కార్మికులు సీఎంపీఎఫ్ లోన్‌కు దరఖాస్తు చేసుకుని సంవత్సర కాలం అవుతున్నా ఇప్పటికీ అది అందలేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు కృష్ణ, లక్ష్మీనారాయణ, జనార్ధన్, అశోక్, సంపత్‌రావు, సంపత్, సాంబయ్య, సమ్మయ్య, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూపాలపల్లి, మార్చి 8: భూపాలపల్లి పట్టణంలోని పలు కాలనీలలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ విశ్వాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జంగేడులో గల 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 7.30 నుంచి 10గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.